క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఎంపీపీగా శోభ



బాధ్యతలు స్వీకరిస్తున్న శోభ

కొత్తూర్: స్థానిక ఎంపీపీ మధుసూదన్‌రెడ్డిపై హత్యానేరం కేసు నమోదు కావడంతో వైస్ ఎంపీపీ శోభను ఇన్‌చార్జ్ ఎంపీపీగా నియమిస్తు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సోమవారం శోభ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీలత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణయ్య యాదవ్, సర్పంచ్ అజయ్ నాయక్, నాయకులు యాదగిరి, గోపాల్ నాయక్, నరసింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోకు ఘన సన్మానం



ఆర్డీవోను సన్మానిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

శంకర్‌పల్లి: ప్రపంచ అథ్లెటిక్స్ పోటీల్లో వెండి పతకం సాధించిన చేవెళ్ల ఆర్డీవో వేణుమాధవ్‌ను సోమవారం శంకర్‌పల్లి తహసీల్దార్ నయిమొద్దీన్, సీఐ ప్రసన్న కుమార్, రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రియాంక, రెవెన్యూ సూపరింటెండెంట్ పవన్, జూనియర్ అసిస్టెంట్ ప్రియ, ఆర్ఐ తేజ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడల్లో సత్తా చాటాలి



క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్‌ను అందజేస్తున్న సర్పంచ్ పద్మ

షాద్‌నగర్: కబడ్డీ క్రీడాకారులు జిల్లాస్థాయి పోటీల్లో సత్తా చాటి గ్రామానికి మంచి పేరు తేవాలని సర్పంచ్ పద్మ అన్నారు. సీఎం కప్ – 23 మండల స్థాయి కబడ్డీ పోటీల్లో విజయం సాధించిన కంసాన్‌పల్లి జట్టు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ జట్టుకు సర్పంచ్ పద్మ, మాజీ వైస్ ఎంపీపీ నరేందర్‌రెడ్డి రూ. 10వేల నగదు, స్పోర్ట్స్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని అన్నారు. వారి ప్రతిభను వెలికి తీసేందుకే ప్రభుత్వం ఈ పోటీలు నిర్వహిస్తోందని తెలిపారు. కంసాన్‌పల్లి జట్టు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలని వారు ఆకాంక్షించారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, భక్తులు

కొందుర్గు: దైవ చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం గోవులబండ తండాలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవానికి ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలన్నారు.

30న మండల సర్వసభ్య సమావేశం

కొత్తూర్: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 30న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శరత్ చంద్రబాబు సోమవారం తెలిపారు. ఇన్‌చార్జ్ ఎంపీపీ శోభ అధ్యతన సమావేశం జరుగుతుందని తెలిపారు. ఉదయం 11గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు.

వర్షాలు పడడమే తరువాయి..



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సంధ్య

- 8వ విడత హరితహారానికి సర్వం సిద్ధం
- 28 గ్రామ పంచాయతీల్లో మొక్కల పెంపకం

మొయినాబాద్ రూరల్: మండలంలో 8వ విడత హరితహారం కార్యక్రమానికి మొక్కలు సిద్ధమవుతున్నాయి. అన్ని గ్రామ పంచాయతీల్లో మొక్కల పెంపకం జోరుగా సాగుతోంది. జూన్ మాసం నాటికి 2.80లక్షల మొక్కలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ప్రతి నర్సరీలో 10వేల మొక్కలు పెంచుతున్నారు. మండలంలోని హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్, బాకారం, ఎన్కేపల్లి, అమ్డాపూర్, ముర్తుజాగూడ, నదీమ్‌పేట్, కనకమామిడి, అప్పారెడ్డిగూడ, నక్కలపల్లి, ఎత్‌మార్‌పల్లి, కేతిరెడ్డిపల్లి, చిన్న మంగళారం తదితర గ్రామాల్లో టెకు, జామ, ఉసిరి, గులాబీ, కరివేపాకు, కానుగా, మునగ తదితర మొక్కలు పెంచుతున్నారు. జూన్ మాసం నుంచి వానాకాలం ప్రారంభం కానుండడంతో మొక్కలు నాటేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.

అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం



వర్షాలు పడగానే మొక్కలు నాటేందుకు అన్ని చర్యలు చేపట్టాం. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా గ్రీన్ షెడ్ నెట్లు ఏర్పాటు చేశాం. అంతేకాకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో నీళ్లు పోస్తున్నాం.

– సంధ్య, ఎంపీడీఓ, మొయినాబాద్

లక్ష్యం మేరకు మొక్కలు



మండలంలో జూన్ నాటికి 2.80లక్షల హరితహారం మొక్కలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే అన్ని నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నాం. ప్రజలకు ఇష్టమైన మొక్కలు కూడా అందుబాటులో ఉంచుతున్నాం. వర్షాలు పడగానే మొక్కలు నాటే కార్యక్రమం మొదలవుతుంది.

– వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ, మొయినాబాద్

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, గ్రామ పంచాయతీ కార్మికులు

చేవెళ్ల: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏ దేవేందర్ డిమాండ్ చేశారు. సోమవారం చేవెళ్లలో సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ వేణుమాధవ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులకు జీఓ నంబర్ 60 ప్రకారం 15,600 ఇవ్వాలని, 10లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి కార్మికుడికి తప్పని సరిగా గుర్తింపు కార్డు అందజేయాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే వారి తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ చేవెళ్ల మండల అధ్యక్షుడు నర్సింలు, షాబాద్ మండల అధ్యక్షుడు నర్సింహ, నాయకులు భీమయ్య, నర్సింలు, శ్రీను, మురళి, రవి, స్వరూప, అడివమ్మ, మల్లమ్మ, దస్తగిరి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మొయినాబాద్ రూరల్: మండలంలోని చిన్నమంగళారం గ్రామ జెడ్పీహెచ్ఎస్‌లో 2004 – 05 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు సోమవారం కలిశారు. గ్రామ సమీపంలోని ఓ ఫామ్ హౌస్‌లో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఆనాటి తీపి గుర్తులను నెమరేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేశవ్‌నగర్‌లో బీజేపీ నేతల పర్యటన



పనులను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ హైదరాబాద్ గూడ కేశవ్‌నగర్ కాలనీలో సోమవారం డివిజన్ బీజేపీ అధ్యక్షులు షాబాద్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పర్యటించారు. స్థానికులు డ్రైనేజీ, మంచినీరు, పారిశుధ్యం తదితర సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా డ్రైనేజీ మ్యాన్‌హోల్ ప్రమాదభరితంగా మారాయని చెప్పడంతో జలమండలి మేనేజర్ శ్రావ్యకు ఫిర్యాదు చేశారు. ఆమె వెంటనే స్పందించి కాలనీలో ప్రమాదకరంగా మారిన డ్రైనేజీ పనులను చేపట్టాలని సిబ్బందిని ఆదేశించడంతో సాయంత్రం పనులను పూర్తి చేశారు. ఈ సందర్భంగా స్థానికులు బీజేపీ నాయకులతో పాటు జలమండలి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు మూల శ్రీనివాస్ గౌడ్, కాకుళారం కృష్ణ, డివిజన్ ప్రధాన కార్యదర్శులు సాయి యాదవ్, రాజు పహిల్వాన్, విజయ్ రావుత్, శ్యామ్ సింగ్, దండోలు యాదగిరి, నాగరాజు, బస్తీవాసులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం చేసుకోండి

తహసీల్దార్ కృష్ణ

తలకొండపల్లి: ఓటర్‌కార్డును ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసుకోవాలని తహసీల్దార్ కృష్ణ అన్నారు. సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఒకే ఇంటి నంబర్‌తో 6 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఇళ్లను గుర్తించడం జరిగిందన్నారు. ఆ ఓటర్లందరూ ఒకే ఇంటిలో నివసిస్తున్నారా లేదా అని విచారణ చేశామన్నారు. మండలంలో 143 మందికి చెందిన ఇంటి నంబర్లు తప్పుగా ఉన్నాయని.. అవి మార్చడానికి వారివారి ఆధార్‌కార్డును తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

రాయితీపై పచ్చిరొట్ట, జనుము విత్తనాలు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని ఆగ్రోరైతు సేవా కేంద్రంలో 65 శాతం రాయితీపై జనుము, పచ్చిరొట్టవిత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టా పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకొని విస్తరణాధికారిని సంప్రదించాలని రైతులకు సూచించారు. 40 కేజీల బస్తా రూ.3500 ఉండగా.. రాయితీపై రూ.1225కి లభిస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.

ఎన్‌టీఆర్ ఘాట్‌కు టీడీపీ నేతల పాదయాత్ర

ఆమనగల్లు: ఎన్‌టీఆర్ శతజయంతిని పురస్కరించుకుని ఆమనగల్లు పట్టణం నుంచి హైదరాబాద్‌లోని ఎన్‌టీఆర్ ఘాట్ వరకు పలువురు టీడీపీ నాయకులు పాదయాత్రగా బయలుదేరారు. టీడీపీ నాయకులు ముత్యాల పరమేశ్, దేవేందర్‌యాదవ్ చేపట్టిన పాదయాత్రను సోమవారం టీడీపీ సీనియర్ నాయకులు బ్రహ్మం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యాదయ్య, వెంకటస్వామి గౌడ్, వజ్రలింగం, శేఖర్‌యాదవ్, భాస్కర్‌గౌడ్, శ్రీశైలం, యాదగిరి, సత్యానారాయణ, రాము, శ్రీశైలం, అశోక్, బాలకృష్ణయ్య, శరణయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

సర్పంచ్ జగన్‌రెడ్డి

మంచాల: మంచాల మండల కేంద్రంలోని డీసీఎంఎస్ వరిధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని మంచాల సర్పంచ్ అనిరెడ్డి జగన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. వివిధ గ్రామాల నుంచి రైతులు వరిధాన్యం విక్రయించడానికి కొనుగోలు కేంద్రం వద్దకు ధాన్యం తీసుకొని వచ్చారు. సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో వర్షాలు వచ్చి వరిధాన్యం పాడైపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకొని వచ్చి ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తక్షణమే వచ్చిన వరి ధాన్యం వచ్చినట్లుగా కొనుగోలు చేయాలన్నారు. విక్రయించిన ధాన్యం బిల్లులు కూడా త్వరితగతిన వచ్చే విధంగా చూడాలన్నారు.

పంట నష్టపరిహారం ఇవ్వాలి

మంచాల: వడగండ్ల వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ డిమాండ్ చేశారు. మంచాల మండలంలోని ఆరుట్ల గ్రామంలో వడగండ్ల వర్షాలకు దెబ్బతిన్న పంట చేలను సోమవారం వారు పరిశీలించారు. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులు తీవ్ర ఇబ్బందులు పడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జంగయ్యగౌడ్, రైతుబంధు కన్వీనర్ చిందం రఘుపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జానీపాషా, నాయకులు జంగయ్య, చంద్రయ్య, ప్రవీణ్‌కుమార్‌గౌడ్, ఐలయ్య, రాము, వెంకటేష్, మోహన్‌రెడ్డి, అఖు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్ టీఎన్‌జీఓస్ కాలనీ ప్రాంతంలోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ప్రహరీలతో పాటు నిర్మాణాలను సోమవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. టీఎన్‌జీఓస్ కాలనీ ప్రాంతంలోని సర్వే నంబర్ 150/1లో ప్రభుత్వ స్థలంలో కొందరు వ్యక్తులు అక్రమంగా ప్రహరీలతో పాటు గదులను నిర్మించారు. స్థానిక బీజేపీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు స్పందించిన రాజేంద్రనగర్ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ సారిక ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించారు. సోమవారం ఉదయం అక్రమ నిర్మాణాలను కూల్చివేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలను చేపడితే సహించేది లేదన్నారు. ప్రస్తుతం 150/1 సర్వే నంబర్‌లో నిర్మించిన నిర్మాణాలను కూల్చివేశామని.. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

శంషాబాద్: పట్టణంలోని గొల్లపల్లి హనుమాన్ సమేత ఇష్ట కామేశ్వరి, కాశీవిశ్వేర దేవాలయ అష్టమ వార్షికోత్సవ పూజలు సోమవారం ముగిశాయి. చివరి రోజు భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోమాత పూజ, అవాహిత దేవతార్చన, మహాచండి హననం, నవగ్రహ హోమం, మహా పూర్ణాహుతి, శివపార్వతుల శాంతి కల్యాణం, బలిహరణం, అవభృథం, మహాదాశీర్వచనం, వేద పండితుల సత్కారం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కె. చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ జిట్ట సిద్దులు దంపతులు, నర్సింహారెడి, చంద్రాచారి, యాదయ్య, వెంకటేష్‌గౌడ్, పాండు,బాబు, భిక్షపతి, బాలయ్య, రాముచారి, నరేందర్, భాస్కర్, బాల్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, నవీన్, నర్సింహా, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలి

ఎంపీడీఓ రాఘవులు



ఇంకుడుగుంత నిర్మాణానికి మార్కింగ్ వేస్తున్న సిబ్బంది

ఆమనగల్లు: ప్రతి ఇంటికి ఇంకుడుగుంత నిర్మించాలని మాడ్గుల ఎంపీడీఓ రాఘవులు సూచించారు. మాడ్గుల మండలంలోని నల్లవారిపల్లి, అవురుపల్లి గ్రామాల్లో సోమవారం ఎంపీడీఓ రాఘవులు పర్యటించారు. ఆయా గ్రామాల్లో కమ్యూనిటీ ఇంకుడుగుంతల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే ఆయా గ్రామాల్లో మరుగుదొడ్లకు ఒకే గుంత ఉన్నచోట అదనపు గుంతను నిర్మించి మరుగుదొడ్లను సక్రమంగా వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నల్లవారిపల్లి సర్పంచ్ పార్వతమ్మ, ఆయా గ్రామాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరంగా తొండుపల్లి



మాట్లాడుతున్న ఓబీసీ మోర్చా కార్యదర్శి కుమార్

శంషాబాద్: మున్సిపాలిటీలోని తొండుపల్లి 10వ వార్డు మూడున్నరేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదని పట్టణ ఓబీసీ మోర్చా కార్యదర్శి కుమార్ ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ. కోట్లల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ప్రకటిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, స్థానిక కౌన్సిలర్లు క్షేత్ర స్థాయిలో చూపించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల్లో జరిగిన అభివృద్ధి కూడా జరగడం లేదన్నారు. కౌన్సిలర్ స్థానంలో ఆమె కుమారుడు పెత్తనం చేస్తున్నారని ఆరోపించారు. దీంతో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోయిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఇంజమూరి శ్రీకాంత్‌గౌడ్, అనిల్‌కుమార్, గణేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి హామీ ఏమైంది?



సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ అనిల్

తలకొండపల్లి: సీఎం కేసీఆర్ నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి మంజూర్ చేయాలని బీజేవైఎం కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత 9 ఏళ్లుగా ఉద్యోగాలు కల్పించకుండా.. నిరుద్యోగ యువతపై నిర్లక్ష్యధోరణి వహిస్తోందంటూ సోమవారం మండల కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉద్యోగం లేని ప్రతి నిరుద్యోగుడికి ప్రతినెలా రూ.3016 ఇస్తానని చెప్పి మోసం చేశారని అన్నారు.అనంతరం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి పాండు, జిల్లా కార్యవర్గ సభ్యులు మహేష్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ అనిల్, మండల అధ్యక్షుడు శ్రీకాంత్, కుమార్, శాంతకుమారి, బాలకృష్ణ, రవి, శేఖర్, కుమార్, యాదయ్య పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ పాండురంగానగర్‌లో రూ. 9 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను సోమవారం కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ అత్తాపూర్ డివిజన్‌కు రావాల్సిన నిధులను మంజూరు చేయడంలో జాప్యం చేస్తుందన్నారు. కౌన్సిల్ సమావేశంలో ఈ విషయాన్ని ప్రస్తావించేందుకు తాను సిద్ధమవుతుండగా... కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేశారని ఆరోపించారు. పాండురంగానగర్‌లో సీసీ రోడ్డు శిథిలావస్థకు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారన్నారు. జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి రూ.9 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అసిస్టెంట్ ఇంజనీర్ నరసింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ వీరారెడ్డి, బీజేపీ నాయకులు బీట్యాకరి సిద్దేశ్వర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగలకు రిమాండ్

రాజేంద్రనగర్: బైక్‌పై వెళుతున్న వారిపై దాడి చేసి వాహనంతో పరారైన ఇద్దరు నిందితులను రాజేంద్రనగర్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి పల్సర్ వాహనంతో పాటు యాక్టివాను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. రాజేంద్రనగర్ హైదర్‌గూడ ప్రాంతంలోని సమిష్టి బార్ అండ్ రెస్టారెంట్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న షేక్ సదుల్ ఈ నెల 14న రాత్రి బార్ మూసివేసిన అనంతరం బార్‌లో పని చేస్తున్న మణెమ్మ అనే మహిళను గోల్డెన్ హట్స్ ప్రాంతంలోని ఆమె ఇంటి వద్ద విడిచిపెట్టేందుకు బైక్‌పై బయలుదేరాడు. గోల్డెన్ హట్స్ ఆడమ్ స్కూల్ వద్దకు రాగానే బాలాపూర్ షాహీనగర్‌కు చెందిన మహ్మద్ తాహా, నాంపల్లి సుల్తాన్‌బజార్‌కు చెందిన ముజుతాబా హుస్సేన్ వారిని అడ్డుకుని వివరాలు అడిగారు. రాత్రి వేళల్లో ఎక్కడ వెళుతున్నావ్ అంటూ అతడిపై దాడి చేశారు. బైక్ లాక్కుని అదే వాహనంపై అక్కడి నుంచి పరారయ్యారు. షేక్ సదుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రాజేంద్రనగర్ పోలీసులు సోమవారం ఉదయం ఆరాంఘర్ ప్రాంతంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి పల్సర్ వాహనంతో పాటు మరో యాక్టివా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరిపై నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నాయని... వాటి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

రెవెన్యూ విభాగంలో భారీ కుంభకోణం



వివరాలు వెల్లడిస్తున్న సంజయ్ యాదవ్ తదితరులు

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీ రెవెన్యూ విభాగంలో భారీ కుంభకోణం చోటు చేసుకుందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, కౌన్సిలర్ సంజయ్‌యాదవ్ ఆరోపించారు. ఇందుకు సంబంధించి పూర్తి ఆధారాలున్నాయని వెంటనే ఆడిట్ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీకి ఏకైక ఆదాయవనరైన ఆస్తిపన్ను ముదింపులో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. పట్టణంలోని ప్రధాన చౌరస్తా నుంచి జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న వాణిజ్య సముదాయాల ఆస్తిపన్ను ముదింపులో ప్రభుత్వ భూమి విలువను భారీగా తగ్గించారన్నారు. ప్రభుత్వ పరంగా భూమి విలువ గజం రూ. 26.700 ఉండగా దానిని రూ.6.700కు తగ్గించారని, అంతేగాక ఆస్తిపన్ను ముదింపులో ఒక్కో వాణిజ్య సముదాయానికి వేలు, లక్షల్లో తగ్గించారన్నారు. గత మున్సిపల్ కమిషనర్‌తో పాటు రెవెన్యూ విభాగం అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా జాయింట్ కలెక్టర్‌కు సైతం పూర్తి వివరాలను వివరించి వినతి పత్రం అందజేశామన్నారు. డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అధికారులు వెంటనే ప్రత్యేక ఆడిట్ చేయించి వాస్తవాలను ప్రజలకు వివరించాలన్నారు. తమ వద్ద ఉన్న ఆధారాలను జిల్లా కలెక్టర్, మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ , పట్టణ ఉపాధ్యక్షుడు శేఖర్ గుప్తా, నజీరుద్దీన్, అశోక్, ఇమ్రాన్, చందు యాదవ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.